క్లుప్తంగా

నేడు ఉచిత దంత వైద్యశిబిరం

విజయవాడ కల్చరల్: వెనిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ బుధవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, ప్రధాన కార్యదర్శి నీలం దుర్గారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఐదు గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి బృందం వైద్య సేవలు అందిస్తారని కళాకారులు, కళాభిమానులు ఈ అవకాశం ఉపయోగించుకోవాలని సూచించారు.

ఘనంగా గుణదల లూర్దు మాత వేడుకలు



పెనమలూరు: గుణదల లూర్దుమాత వంద వసంతాల వేడుకలు కానూరు మౌంట్‌కార్మిల్ పుణ్యక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గుణదల పుణ్యక్షేత్రం నుంచి వచ్చిన గుణదల లూర్దుమాత స్వరూపాన్ని ఫాదర్ చలివేంద్ర శౌరి ఆధ్వర్యంలో భక్తుల దీవెనల కోసం ప్రదర్శించారు. గంగూరు, పోరంకి, కామయ్యతోపు, కానూరు నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి లూర్దుమాతను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఫాదర్లు ప్రదీప్, దేవదానం, ఉపదేశకులు పాల్గొని దివ్యబలి పూజ జరిపారు.

సత్తాచాటిన ఎస్ఆర్ఆర్ విద్యార్థులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్రాస్ కంట్రీ, సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తాచాటి ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విజేతల అభినందన కార్యక్రమం జరిగింది. ఉయ్యూరులో జరిగిన కృష్ణా వర్శిటీ అంతర్ కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో కళాశాల విద్యార్థులు ఛాంపియన్ షిప్‌తో మొదటి స్థానం సాధించారు. అలాగే సాఫ్ట్‌బాల్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచారు. క్రాస్ కంట్రీ పోటీల్లో జీ వెంకటేష్, జీ తరుణ్‌లు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు సెలెక్ట్ అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. సాఫ్ట్‌బాల్ పోటీల్లో కే శ్రీను సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీకి సెలెక్ట్ అవ్వడం కళాశాలకే గర్వకారణంగా పేర్కొన్నారు. క్రీడాకారులను కళాశాల ప్రిన్సిపాల్, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ డి.యుగంధర్ అభినందించారు.

మదర్సాకు గ్రైండర్ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మంగళవారం ఉర్దూ పాఠశాల మదర్సాకు గ్రైండర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక, హేమంతరావు మాట్లాడుతూ తమవంతు బాధ్యతగా మదర్సాకు గ్రైండర్ పంపిణీ చేస్తున్నామన్నారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ట్రస్ట్ సభ్యులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

14న సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శోభకృత్ నామ సంవత్సర మాఘ శుద్ధ పంచమి పురస్కరించుకుని ఫిబ్రవరి 14వ తేదీ సామూహిక ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాయిశ్రీ హైస్కూల్ ప్రిన్సిపాల్ బాదినేని రాము మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు లంబాడీపేట గాంధీబొమ్మ సెంటర్‌లోని సాయిశ్రీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ చిన్నారులకు ఉచితంగా అక్షరాభ్యాసం చేయించుకునే తల్లిదండ్రులు వచ్చే నెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. అక్షరాభ్యాసం చేసుకునే చిన్నారులకు ఉచితంగా పలక, స్లేట్ పెన్సిల్, ప్రసాదాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేతాజీ సేవలు మరువలేనివి



నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు ఎన్నటికీ మరువలేనివని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం దుర్గాపురంలోని నేతాజీ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ నేతాజీ నాయకత్వంలో లక్షలాది మంది ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని చెప్పారు. దేశాన్ని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేసేందుకు యువతను 'ఆజాద్ హింద్ ఫౌజ్' వైపు నడిపిన స్ఫూర్తి ప్రదాత సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. ఆయన జీవితం దాదాపు అజ్ఞాత వాసం లాంటిదేనని, జీవితంలో ఎక్కువ భాగం ప్రవాసంలో గడిపారని తెలిపారు. దేశం కోసం తన సర్వస్వం త్యాగం చేశారని పేర్కొన్నారు. అటువంటి అలుపెరుగని పోరాట యోధుడి జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నేటి యువత నేతాజీని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, బీఆర్‌టీఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బీ వసంతకుమార్, కే రాము, జీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తికి ప్రతీక నేతాజీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ధైర్యసాహసాలకు, దేశభక్తికి ప్రతీక నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఎమ్మెల్యే, సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 27వ డివిజన్ దుర్గాపురంలో మంగళవారం సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకొని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత నేతాజీ స్ఫూర్తితో దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. అలుపెరుగని పోరాట యోధుడు నేతాజీ అని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండాయగుంట రాము, పసుపులేటి రమేష్, ఈమని శ్రీధర్, పోతుల విల్సన్, రాజు, గుర్రం ఏడుకొండలు, బ్రహ్మదేశం వసంతకుమార్, పైడిపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నేతాజీకి నివాళులర్పిస్తున్న అంజిబాబు

ప్రజా కాపునాడు ఆధ్వర్యంలో ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు దుర్గాపురంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా కాపునాడు రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి రాజశేఖర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తుది జాబితాలో ఓటు లేకపోతే నమోదు చేసుకోండి

పటమట(విజయవాడతూర్పు): ఓటర్ల తుది జాబితా విడుదలైన సందర్భంలో, తమ పేరు తుది జాబితాలో లేకపోతే వెంటనే తమ పేరును నమోదు చేసుకోవాలని సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం నిర్వహించిన పొలిటికల్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుది జాబితా నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రతి పోలింగ్ స్టేషన్లో అందుబాటులో ఉందని, ఓటర్లు తమ ప్రాంతంలోని బీఎల్వోల ద్వారా కూడా అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు. ఒకవేళ ఓటర్ల పేరు తుది జాబితాలో లేనట్లయితే వెంటనే ఫామ్ 6 ను నింపి బీఎల్వోలకు సమర్పించాలన్నారు. సెంట్రల్‌లో మొత్తం 2,73,754 ఓట్లు ఉన్నాయని అందులో మహిళల ఓట్లు 1,40,656 కాగా మగవారి ఓట్లు 1,33,048 ఉండగా ఇతర ఓట్లు 50 ఉన్నారని తెలిపారు.

గత సమావేశంలో 1400 కంటే ఎక్కువగా ఉన్న ఓటర్లకు ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ఆక్సిలరీ బూతు ను ఏర్పాటు చేసేందుకు వసతులు ఉన్నాయో లేవో తెలుసుకోవాలని బీఎల్వోలకు చెప్పామన్నారు. వీటి ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయని నివేదిక ఇచ్చారు. మరో ఐదు పోలింగ్ కేంద్రాలు ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలుగా అదే పోలింగ్ బూత్‌లో రాబోతున్నాయని తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీ ప్రతినిధులు వై.సుందర్ పాల్ (వైఎస్సార్ సీపీ), వెంకట్ (బీజేపీ), ఎస్ఏ అన్సారి (కాంగ్రెస్), వీరభద్రరావు (సీపీఐ), యం వినోద్ కుమార్ (బహుజన సమాజ్ పార్టీ), చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, జెడ్ సి-2 మల్యాద్రి, డెప్యూటీ తహసిల్దార్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

11న శతాధిక కవి సమ్మేళనం

విజయవాడ కల్చరల్: జాతికి స్ఫూర్తినింపిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ సాక్షిగా ఫిబ్రవరి 11వ తేదీ ఆదివారం మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆధ్వర్యంలో శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు కలిమిశ్రీ అన్నారు. స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కలిమిశ్రీ మాట్లాడుతూ పుణ్యభూమి నా దేశం నమో నమామి పేరుతో శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పుస్తక ఆవిష్కరణలు జరుగుతాయని కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని 83329 03156 నంబరులో సంప్రదించాలని కోరారు. ఆవిష్కరణ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రాఘవేంద్రశేఖర్, సంస్థ సభ్యుడు కుర్రా సురేష్ పాల్గొన్నారు.



కవి సమ్మేళనం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కలిమిశ్రీ, రాఘవేంద్రచంద్రశేఖర్

ధనుంజయుడు పేరుతో పోస్టల్ స్టాంప్ విడుదలకు వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): తొలి తెలుగు శాసనకర్త ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడు పేరుతో పోస్టల్ స్టాంప్, స్మారక నాణెం విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబును తొలి తెలుగు దివ్వె సంస్థ వ్యవస్థాపకుడు పీవీఎల్ఎన్ రాజు, ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధనుంజయుడి గురించి 2020లో 5వ తరగతి ప్రభుత్వ తెలుగు వాచకంలో తొలి తెలుగు దివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం(విజయవాడ) సౌజన్యంతో ప్రచురించారని గుర్తు చేశారు. తెలుగు భాష గురించి విశ్లేషణాత్మక పరిశోధన చేసిన చారిత్రిక పరిశోధకులు తొలి తెలుగు శాసనకర్త ఎరికల్ ముత్తురాజు ధనుంజయుడని నిర్ధారించారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆయన పేరిట పోస్టల్ స్టాంప్, స్మారక నాణేన్ని విడుదల చేస్తే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులు ఎంతో సంతోషిస్తారని తెలిపారు.



విజయబాబుకు వినతిపత్రం అందజేస్తున్న పీవీఎల్ఎన్ రాజు, కొర్న నారాయణ ముదిరాజ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్, 11 కేవీ డోర్నకల్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గాంధీనగర్ సెక్షన్‌లో..

ముత్యాలంపాడు సబ్ స్టేషన్, 11 కేవీ కుదూర్స్ నగర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. మాంగో మార్కెట్, కేదారేశ్వరపేట, కుద్దూస్ నగర్, లోకో కాలనీ, లోకో షెడ్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీన దుర్గాపురం వాకర్స్ క్లబ్‌లో ఆయాన్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ గౌరవ చైర్మన్ వావిలాల రజనీకాంతశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

స్పెల్ మాస్టర్ విజేత మైరా



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్, మిర్చి రేడియో నిర్వహిస్తున్న స్పెల్ మాస్టర్ ఆఫ్ ఇండియా రీజనల్ పోటీల్లో ఏపీ విజేతగా విజయవాడ విద్యార్థిని నిలిచింది. నగరంలోని విశాఖ వ్యాలీ స్కూల్‌కు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఆర్.మైరా(13) గెలుపొందిందని నిర్వాహక సంస్థ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. దేశ వ్యాప్తంగా ఫిబ్రవరి 24వ తేదీన జరుగనున్న గ్రాండ్ ఫైనల్‌లో మైరా పోటీ పడుతుందని వివరించారు. ప్రాంతీయ పోటీల్లో నగరం నుంచి 10 పాఠశాలలు పాల్గొన్నాయని పేర్కొన్నారు.

రివర్‌ఫ్రంట్ పార్క్‌ను అందుబాటులోకి తీసుకురండి

వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): కృష్ణానది పరివాహకంలో వీఎంసీ ఆధ్వర్యాన నిర్మిస్తున్న రివర్ ఫ్రంట్ పార్క్‌ను 15 రోజుల్లోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వీఎంసీ కమిషనర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రివర్ ఫ్రంట్ పార్కును మంగళవారం ఉదయం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలంటే కేవలం ముఖద్వారాన వెళ్లి చివరి వరకు పనులు పూర్తి చేయాలంటే కష్టమని, వెనక వైపు నుంచి కూడా ఒక మార్గాన్ని సూచించి ఇరువైపులా పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కృష్ణానది రిటైనింగ్ వాల్ వెంట సుందరంగా, ఆహ్లాదకరమైన పార్కు ఏర్పాటుకు కనకదుర్గ వారధి నుంచి రామలింగేశ్వర డీపీ స్టేషన్ వరకు 1.25 కి.మీ పొడవున సుమారు రూ.7.8 కోట్ల నగర పాలక సంస్థ వ్యయ అంచనాతో, రూ.4.5 కోట్ల అర్బన్ గ్రీనరీ వారి వ్యయంతో జరుగుతున్న రిటైనింగ్ బ్యూటిఫికేషన్ పార్కును ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకు రావాలని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ట్రీ కెనాఫీ, వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ రోడ్లు, బేస్మెంట్ పనులను పరిశీలించారు.



రివర్‌ఫ్రంట్ పార్క్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రైల్వే అండర్ బ్రిడ్జి పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలి

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను 15 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని, వెహికల్ డిపో వద్ద ఉన్న కెనాల్బండ్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దడానికి పార్క్ లో గ్రీనరీ అభివృద్ధి చేయాలని కమిషనర్ అన్నారు. మంగళవారం ఉదయం నగర పర్యటన లో భాగంగా ఆయన మధురానగర్‌లో వీఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించారు. పర్యటనలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాస్, నారాయణమూర్తి పాల్గొన్నారు.

విజయవాడ అభివృద్ధిపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి వహించారని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 64వ డివిజన్‌లో ప్రతి గడపకు వెలంపల్లి శ్రీనివాస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెలంపల్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కడియాల స్వాతి అనే మహిళ తన బిడ్డ గుండెకు రంధ్రం ఏర్పడిందని వైద్యం చేయించాలని కోరగా.. ఆయన వెంటనే ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌తో ఫోనులో మాట్లాడి ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయాలని కోరారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడ నగరాభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. రోడ్లు, కల్వర్ట్‌లు, పార్కులు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, ఆర్‌టీబీలు, రిటర్నింగ్ వాల్ నిర్మాణాలు వంటి అభివృద్ధి పనులు చేశామని వివరించారు. టీడీపీ హయాంలో విజయవాడ నగరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. అమరావతి పేరుతో రాష్ట్రంలోని ప్రజలందరిని మోసం చేశారని దుయ్యబట్టారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఎన్నడూలేనంతగా అభివృద్ధి జరిగిందని తెలిపారు. అధికారంలో ఉండగా కబ్జాలు, రౌడీయిజం చేసిన బొండా ఉమాకి ప్రజలను ఓటు అడిగే హక్కులేదని విమర్శించారు. సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంని చేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

పోటీ పరీక్షల పుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఠాగూర్ గ్రంథాలయంలో పుస్తకాలు అందజేస్తున్న జమల పూర్ణమ్మ



చిత్తరంజన్ గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలతో పాఠకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ గ్రంథాలయంలో ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలను విద్యార్థులు, నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ జమల పూర్ణమ్మ సూచించారు. గ్రంథాలయంలో సివిల్స్, బ్యాంక్, గ్రూప్స్, రైల్వే వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చారు. వీటిని జమల పూర్ణమ్మ, కార్యదర్శి ఎంపీడీటీ నగేష్ మంగళవారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ సేవలు పొంది విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పుస్తకాలను అందుబాటులోకి తెచ్చిన గ్రంథాలయ సంస్థ వారికి విద్యార్థులు, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాల ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయంలో నిరుద్యోగ యువత కోరిక మేరకు పోటీ పరీక్షల పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ సరఫరా చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

యూనిట్లు స్థాపించేలా ఆర్పీలు చూడాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): వృత్తి విద్యాకోర్సులను నేర్చుకున్న వారితో యూనిట్లను స్థాపించేలా రిసోర్స్ పర్సన్స్ చూడాలని ఎన్టీఆర్ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కె.శాంతి చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆవరణలో మంగళవారం వృత్తి విద్యాకోర్సులకు శిక్షణ ఇచ్చే రిసోర్స్ పర్సన్‌కు కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ జరిగింది. శాంతి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వృత్తి విద్యా కోర్సులపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందేలా యువతను తీర్చదిద్దాలని ఆమె అన్నారు. వ్యాపారవేత్త సీహెచ్ సుశీల మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన వివిధ వస్తువులను సోషల్ మీడియా ద్వారా మార్కెటింగ్ చేసుకుని మంచి ఆదాయం పొందవచ్చునని చెప్పారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా మాట్లాడుతూ విద్యార్థులను అప్‌డేట్ చేస్తూనే రిసోర్స్ పర్సన్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాంతి

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా సిందూర పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

బీసీ కమిషన్ సభ్యుడు మారేష్‌కు అభినందన

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ ఎన్.మారేష్‌ను ఏపీ ముదిరాజ్/ముతరాసి కార్పొరేషన్ చైర్మన్ కొర్న నారాయణ ముదిరాజ్ ఒక ప్రకటనలో అభినందించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ మారేష్ తమ సామాజికవర్గానికి చెందినవారు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యమిచ్చి వారికి సముచిత స్థానాలను కల్పించారని తెలిపారు. సామాన్యుడైన తనను ఏపీ ముదిరాజ్/ముతరాసి అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించటమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీసీ సామాజికవర్గానికి చెందినవారే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా ఉండి గెలిపించుకుని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉంటేనే పారదర్శక పాలన కొనసాగుతుందని, రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో విరాజిల్లుతుందని పేర్కొన్నారు.

క్యాట్ ఒలింపియాడ్ లెవెల్-2లో 'చైతన్య' ప్రతిభ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్ లెవెల్-2 పరీక్షల్లో శ్రీచైతన్య భవానీపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 49 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో ఎస్.శ్రీనందిని, బ్లెస్సీ కె, గాయత్రి.ఎస్, కీర్తి సుధ.కె నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్స్ అందుకున్నారు. మిగిలినవారిలో 16 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్, 29 మంది మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విజేతలను అభినందించారు.

అన్న సమారాధనకు రూ.1.78 లక్షల విరాళం

పెనమలూరు: పెనమలూరులో ఆదివారం జరగనున్న అయ్యప్పస్వామి అన్న సమారాధనకు అమెరికాకు చెందిన ఎన్నారైలు మంగళవారం విరాళం అందజేశారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా అయ్యప్పస్వామి అన్న సమారాధనను భక్తులు నిర్వహిస్తున్నారు. జనవరి 28వ తేదీన నిర్వహించనున్న అన్న సమారాధనకు అవసరమైన బియ్యానికి రూ.1,78,655ను ఎన్నారైలు పంపారు. ఈ మేరకు నిర్వాహకులకు నగదును ఎన్నారై ప్రతినిధులు మోర్ల నరేంద్రబాబు, కిలారు ప్రవీణ్, పాలడుగు సుధీర్ అందజేశారు.

వైఎస్సార్ బీమా అందజేత

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్‌లో నివసిస్తున్న కర్నాటి శ్రీనివాసరావు అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి పేరు వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన నేపథ్యంలో మట్టి ఖర్చుల కింద రూ.10వేల నగదును స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా మృతుడి అయిన భార్య కర్నాటి స్వరాజ్యానికి అందజేశారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందినవారు సహజ మరణంగానీ, ప్రమాదవశాత్తుగానీ మరణిస్తే వైఎస్సార్ బీమా పథకం ఆదుకుంటుందని తెలిపారు. మృతుడి నామినీకి త్వరలో మిగిలిన సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని చెప్పారు.